క్లుప్తంగా

ఇంద్రసేనారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



ఇంద్రసేనారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

మీర్‌పేట: మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డి త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్పొరేటర్లు ఆదివారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంద్రసేనారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట ప్రధాన కార్యదర్శులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, కార్పొరేటర్లు భిక్షపతిచారి, భీంరాజ్, నాయకులు అనితానాయక్, వేణుగోపాల్‌రెడ్డి, యాదగిరి యాదవ్, సత్తయ్య, శ్యాంసుందర్, రాజేష్, తదితరులు ఉన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కందుకూరు: మండలంలోని అగర్‌మియాగూడలో ఏర్పాటు చేసిన మండపంలో ఆదివారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జంగారెడ్డి, యాదవ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి, సవంతిరెడ్డి, వనజా తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్‌లో పోలీసుల కవాతు



కవాతులో పాల్గొన్న మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్

పహాడీషరీఫ్: అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని బాలాపూర్ పోలీసులు, ఆర్‌ఏఎఫ్ బలగాలతో కలిసి ఆదివారం రాత్రి షాహీన్‌నగర్‌లో కవాతు నిర్వహించారు. ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ నుంచి వాదే సలాహీన్, షాహీన్‌నగర్ ప్రాంతాల్లో తిరుగుతూ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తామనే సాంకేతాన్ని ఇచ్చారు. ఓటర్లందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కవాతులో మహేశ్వరం డీసీపీ సీహెచ్.శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటే్ రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సిబ్బందికి చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: దసరా పండుగ సందర్భంగా ఖిల్లా మైసమ్మ ఆలయంలోని ఆలయ సిబ్బందికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి ఆదివారం చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆర్‌కేపురం డివిజన్‌లోని ఉన్న ఆలయాలలో పని చేస్తున్న సిబ్బంది దసరా సందర్భంగా చీరలు అందజేస్తున్నానని తెలిపారు.

కంఠమహేశ్వరస్వామికి పూజలు

కడ్తాల్: మండల కేంద్రంలోని కాటమయ్య ఆలయంలో కొలువైయున్న కంఠమహేశ్వర స్వామికి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. పాడి పంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, నాయకులు యాదయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, కేశవులుగౌడ్, శ్రీరాములుగౌడ్, జంగయ్యగౌడ్, శంకరయ్య, రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

కృష్ణకు ఘన సన్మానం

తలకొండపల్లి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డిగ్రీ కృష్ణను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. డిగ్రీ కృష్ణ ఇటీవల ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి నియామకపత్రాన్ని కృష్ణకు అందజేశారు. ఆదివారం మండల పరిధిలోని రామాకృష్ణాపురంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణను సన్మానించారు. సీనియర్ నాయకుడు రామకృష్ణ, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరథం, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్ యాదవ్, సోషల్ మీడియా అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అజీం, ఎస్సీసెల్ మండల చైర్మన్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ

ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయె చందమామ..రెండేసి పూలేసి చందమామ.. రెండు జాములాయె చందమామ అంటూ బతుకమ్మ వేడుకల్లో తొమ్మిదో రోజు, చివరి రోజు 'సద్దుల బతుకమ్మ'గా గౌరమ్మను ఆరాధిస్తారు. గుమ్మడి ఆకులు, గునుగు పూలు, తంగేడు, ఇతర రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చారు. సద్దులను నైవేద్యం పెట్టి, పూజలు చేశారు. రాత్రి వరకూ ఆటపాటలతో అమ్మవారిని కొలిచి, చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



కొత్తగూడ: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అల్మాస్‌గూడలో..



కందుకూరులో..



మీర్‌ఖాన్‌పేటలో..



రావిర్యాలలో..



మహేశ్వరంలో..



మీర్‌పేట్: బతుకమ్మ వేడుకలో పాల్గొన్న మేయర్ దుర్గాదీప్‌లాల్



హుడాకాంప్లెక్స్‌లో..

మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- పీసీసీ నాయకుడు ఏనుగు జంగారెడ్డి



పార్టీలో చేరిన వారితో జంగారెడ్డి

కందుకూరు: మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని పీసీసీ నాయకుడు ఏనుగు జంగారెడ్డి, చిగురింత నర్సింహారెడ్డి, సరికొండ మల్లేశ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్, యూత్ నాయకుడు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బేగరికంచె, చిప్పలపల్లి, సాయిరెడ్డిగూడ, కొత్తూర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి నేతలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, అందువల్లే కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజాప్రతాప్‌రెడ్డి, మైనార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు బి.రాఘవేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ప్రశాంతి, యూత్ అధ్యక్షుడు నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

సబితారెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరు



కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలు

- అభివృద్ధి, సంక్షేమ పథకాలే మంత్రిని గెలిపిస్తాయి
- మహేశ్వరాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దారు
- బీఆర్‌ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి
- గులాబీ పార్టీలో పలువురి చేరిక

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంలో సబితారెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తాయని ఆ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి జోస్యం చెప్పారు. మంత్రి విజయాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మహేశ్వరంలోని పోచమ్మ గడ్డ బస్తీకి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో ఇంటర్మీడియట్ కాలేజ్, పాలిటెక్నిక్, డిగ్రీ, డైట్ కాలేజ్, మోడల్ స్కూల్ అదనపు గదుల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణంతో పాటు కందుకూరులో లా, మెడికల్ కాలేజీలను తీసుకొచ్చి మహేశ్వరాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దారని కొనియాడారు. రావిర్యాల ఈ-సిటీ, మహేశ్వరం ఎలక్ట్రికల్ పార్కులో విప్రో, మలబార్, పలు టీవీ, మొబైల్స్ తయారీల కంపెనీలతో పాటు సోలార్ కంపెనీల ఏర్పాటుకు మంత్రి కృషి చేశారని తెలిపారు. పరిశ్రమల స్థాపనతో స్థానిక యువకులకు ఉపాధి అవకాశాలు పెంపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, జిల్లా రైతు కమిటీ సభ్యుడు యాదయ్య, మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అంబయ్య యాదవ్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎనిమిదో రోజు దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అభిషేకం, అర్చన, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, దుర్గాదేవి హోమం, గణపతి, నవగ్రహ హోమం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ వంటి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ గౌడ్, స్థానిక సర్పంచ్ ప్రియాంక, ఆలయ డైరెక్టర్లు చంద్రయ్య, యాదమ్మ, బాలరాజ్, వెంకటేశ్, రవీందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికి శుభాలు కలగాలి

- మంత్రి సబితారెడ్డి



అమ్మవారిని దర్శించుకున్న సబితారెడ్డి

బడంగ్‌పేట్: విజయదశమి సందర్భంగా ప్రజలందరికీ శుభాలు కలగాలని మంత్రి సబితారెడ్డి దుర్గామాతను వేడుకున్నారు. ఆదివారం బడంగ్‌పేటలోని కాశీబుగ్గ శివాలయం, వేంకటేశ్వర ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు స్వప్న, మమత, శోభ, సంతోషి, కో ఆప్షన్ సభ్యురాలు ప్రసన్న, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు ఆనంద్‌రెడ్డి, జంగారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

మహేశ్వరం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంగిలిపూలతో బతుకమ్మ ఉత్సవాలతో పాటు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ సందర్భంగా సీఎం కేసీఆర్ ఆడపడుచులకు చీరలను పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్‌గౌడ్, గ్రామ సర్పంచ్ ప్రియాంక, ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్, ఆలయ మాజీ చైర్మన్‌లు కూన యాదయ్య, నవీన్, మాజీ పీఏసీఎస్ అంబయ్య యాదవ్, డైరెక్టర్లు చంద్రయ్య,మహేందర్, రవీందర్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా శోభ

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- గ్రామాల్లో శమీపూజలకు ఏర్పాట్లు



జమ్మి చెట్టు

హుడాకాంప్లెక్స్: శమీ శమయతే పాపం... శమీ శత్రు నివారిణీ, అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ అని స్తుతిస్తూ దసరా పర్వదినాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. దీంతో ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని సరూర్‌నగర్, ఆర్‌కేపురం, బాలాపూర్, కందుకూరు మండలాల్లోని గ్రామాల్లో విజయదశమి సందర్భంగా భక్తుల కోసం ఆలయాల్లో జమ్మి చెట్టును సిద్ధం చేశారు. సరూర్‌నగర్ మున్సిపల్ గ్రౌండ్, కొత్తపేట అష్టలక్ష్మి ఆలయం, బడంగ్‌పేటతో పాటు పలు కూడళ్లలో రావణ దహనం నిర్వహించనున్నారు. ముందుగా శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం రావణ దహనం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. రకరకాల పిండివంటలు తయారీలో మహిళలు బిజీబిజీగా ఉన్నారు. ఆడపడుచులు, బంధువులతో గ్రామాల్లో సందడి నెలకొంది.

30 ఏళ్లుగా దసరా వేడుకలు



సరూర్‌నగర్ మండల గ్రౌండ్‌లో 30 ఏళ్లుగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. ఆనవాయితీగా రావణ దహనం అనంతరం ఆలింగనం చేసుకుని అలాయ్ బలాయ్ చేసుకుని జమ్మి ఆకులను ఇస్తూ శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఆనందంగా దసరాను జరుపుకుంటాం. ఈ వేడుకలకు మంత్రి సబితారెడ్డి, సినీ నటుడు బిత్తిరి సత్తి, బీజేపీ నాయకుడు శ్రీరాములు యాదవ్‌ను ఆహ్వానించాం. భక్తులందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలి. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– సాతెల్లి నాగరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్

కల్వకుర్తిలో బీజేపీదే విజయం

మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్



పోలెపల్లిలో బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఆచారి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్ కోరారు. ఆమనగల్లు మండలం పోలెపల్లిలో బీజేపీ నూతన కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. మరోమారు మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయం అన్నారు. కల్వకుర్తిలో బీజేపీ అభ్యర్థి ఆచారి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి ఒగ్గు ప్రభాకర్, నాయకులు నర్సింహ, లక్ష్మణ్‌రావ్, భగవాన్‌రెడ్డి, వెంకటేశ్, శంకరయ్య, సత్యనారాయణ, రవి, శ్రీశైలం, సైదులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని న్యామతాపూర్‌లో గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఆదివారం బూత్ కమిటీని ఎన్నుకున్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేశారు. రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ గోపాల్, నాయకులు ఉన్నారు.